ప్రజల చేతిలో
www.ayudamdaily.com

# ఆయుధం

The Common People's Voice

శుక్రవారం | జూన్ 19, 2026 | సంపుటి : 7 | సంచిక : 19 | పేజీలు : 2

## ఓటరు జాబితా ప్రత్యేక సవరణను పకడ్బందీగా నిర్వహించాలి

- ప్రతి ఓటరును ఖచ్చితంగా మ్యాపింగ్ చేయాలి
- హన్మకొండ కలెక్టర్, వరంగల్ తూర్పు ఈఆర్‌వో చాహత్ బాజ్‌పాయి




2 లో

## టీజీపీఎస్సీ గుడ్‌న్యూస్

- డైట్ కాలేజీల్లో లెక్చరర్ పోస్టులకు నోటిఫికేషన్

**హైదరాబాద్, ఆయుధం:** తెలంగాణలో నిరుద్యోగులకు టీజీపీఎస్సీ శుభవార్త చెప్పింది. ఇటీవల పలు ఉద్యోగ నియామక నోటిఫికేషన్లు విడుదల చేసిన టీజీపీఎస్సీ.. తాజాగా పాఠశాల విద్యాశాఖ పరిధిలోని డైట్ కళాశాలల్లో సీనియర్ లెక్చరర్స్, లెక్చరర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు జూన్ 24 నుంచి జులై 29వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. నవంబర్‌లో ఈ పరీక్ష జరిగే అవకాశం ఉంది. టీజీపీఎస్సీ మొత్తంగా 86 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా.. వీటిలో సీనియర్ లెక్చరర్లు 23 కాగా, వివిధ సబ్జెక్టులకు సంబంధించి 63 లెక్చరర్ పోస్టులు ఉన్నాయి. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయసు 2026 జులై 1 నాటికి కనీసం 18 ఏళ్లు పూర్తయి ఉండాలి. గరిష్ఠ వయో పరిమితిని 44 ఏళ్లుగా పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం వివిధ కేటగిరీలకు వయో పరిమితిలో సడలింపు ఉంటుంది. లెక్చరర్ పోస్టుల భర్తీకి సంబంధించి జోన్‌ల వారీగా పోస్టుల ఖాళీలు, వయో పరిమితి, వేతనం, పరీక్ష సిలబస్ తదితర వివరాలను https://www.tgpsc.gov.in వెబ్‌సైట్‌లో చూడొచ్చు.



2 లో

## మత్తు నియంత్రణలో డ్రగ్స్ కంట్రోల్ టీం పనితీరు భేష్

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

# భారత్ ఫ్యూచర్‌సిటీ నిర్మించి తీరుతాం

- రంగారెడ్డి జిల్లా గుర్రంగూడలో వన మహోత్సవాన్ని ప్రారంభం
- గుర్రంగూడ అర్బన్ ఎకో పార్క్ నమూనా సీఎంకు వివరించిన అటవీ అధికారులు
- హరిత నిధి ద్వారా నాగలింగం మొక్క నాటిన సీఎం



**హైదరాబాద్, ఆయుధం:**

ఎల్బీనగర్ ప్రాంతంలో 424 ఎకరాల విస్తీర్ణంలో పార్కు ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైడ్రాను తీసుకొస్తే దానిని భూతంగా చూపించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన మండిపడ్డారు. న్యాయంగా నిర్మాణాలు చేసిన వారికి జోలికి హైడ్రా వెళ్లదని స్పష్టం చేశారు. నాళాలు, చెరువులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే మాత్రం హైడ్రా ఊరుకోదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. చెరువులు కబ్జాలు చేయడం వల్లే కాలనీల్లో నీళ్లు నిల్వ ఉంటున్నాయన్న సీఎం, ప్రజలు ఈ విషయం గ్రహించాలన్నారు. రంగారెడ్డి జిల్లా గుర్రంగూడలో వనమహోత్సవాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన అనంతరం ప్రసంగించారు. ఢిల్లీలో గాలి, నీరు మొత్తం విషమని అక్కడ నివసించలేమని, వర్షం వస్తే ముంబయి, బెంగళూరులో బయటకు రాలేని పరిస్థితి ఉందన్నారు. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు పరిస్థితి హైదరాబాద్ నగరానికి రాకూడదనే తమ ప్రయత్నమని తెలిపారు.

### అభివృద్ధి చెస్తామంటే అడ్డుకుంటున్నారు :

మూసీ అభివృద్ధి చేస్తామంటే విపక్షాలు అడ్డుకుంటున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో మూసీ చుట్టుపక్కల ఉంటే దోమలు నోట్లోకెళ్లేవన్నారు. కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు ఇవ్వాలనే తాము ప్రయత్నిస్తున్నామని, నగర అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామన్నారు. ఫ్యూచర్ లేని నేతలు ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని చెబుతున్నారని రేవంత్ రెడ్డి మండపడ్డారు.




అలా చెప్పిన ఆయన ఈసారి సిద్దిపేటలో గెలవడన్నారు. వాళ్ల ఫ్యూచర్‌ను ప్రజలు నిర్ణయిస్తే ఫాంహౌస్‌కు పరిమితమయ్యారన్నారు. కల్వకుంట వాళ్ల కడుపు నిండా కాలకూట విషమేనని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. మూసీలో కాలుష్యం కంటే కల్వకుంట వాళ్ల కడుపులో కాలుష్యమే ఎక్కువని రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే ప్రజలు వాళ్లకు బుద్ధిచెప్పారన్నారు. ప్రజలు మురికిలోనే పొర్లాలని వాళ్లు భావిస్తున్నారన్నారు.

### మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం

ఎవరేమనుకున్నా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. సబర్మతి, యమునా కంటే గొప్పగా మూసీ ప్రక్షాళన చేస్తామన్నారు. చెరువులు, నాళాలు ఆక్రమిస్తే వీపులకు సున్నం పెడతామన్నారు. చెరువులు, నాళాలు ఆక్రమిస్తే వీపులకు సున్నం పెడతామన్నారు. ఎవరు అడ్డంపడి దొర్లినా, ఎండ్రిన్ తాగినా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామన్నారు.

## 30న రైతు భరోసా నిధులు విడుదల

హైదరాబాద్, ఆయుధం: వానాకాలం పంటలకు రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులను విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రుల సమావేశం నిర్ణయించింది. ఈ నెల 30వ తేదీన ఖమ్మం జిల్లా మధిరలో పెద్దఎత్తున రైతుల సమ్మేళనం నిర్వహించాలని తీర్మానించింది. రైతుల సమ్మేళనం సందర్భంగా అదే వేదికగా రైతు భరోసా నిధులను విడుదల చేసి రైతుల ఖాతాలో జమ చేసే ప్రక్రియను ప్రారంభిస్తారు. సన్న ధాన్యానికి సంబంధించి ఏడు రకాల సన్నాలకు బోనస్ చెల్లించాలని నిర్ణయించారు. మార్కెట్‌లో ఉన్న డిమాండ్, ప్రజల వినియోగం, అధిక దిగుబడి వంటి అనేక అంశాలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

దీని ప్రకారం బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం1638, డబ్ల్యూజీఎల్44, కేఎన్ఎం7715.. ఏడు రకాల సన్నాలకు బోనస్ వర్తిస్తుంది. రాష్ట్రంలో రైతులు ఈ ఏడాది దేశంలోనే రికార్డు స్థాయిలో అత్యధిక ధాన్యం పండించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సీజన్‌లో ప్రభుత్వం రికార్డు స్థాయిలో ఇప్పటికే దాదాపు 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది. సమావేశం అనంతరం మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, ధనసరి అనసూయ సీతక్క మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు.



## చేనేత ఉత్పత్తులను టెండర్ విధానం నుంచి మినహాయించాలి

- సీఎం రేవంత్‌కు మంత్రి సురేఖ వినతి

**వరంగల్, ఆయుధం:** చేనేత వస్త్ర ఉత్పత్తులకు కేంద్రీకృత టెండర్ విధానం నుంచి మినహాయింపు ఇవ్వాలని మంత్రి కొండా సురేఖ సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆమె వినతిపత్రం అందజేశారు. వరంగల్ జిల్లా చేనేత సహకార సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 50కు పైగా చేనేత సహకార సంఘాలకు చెందిన సుమారు 5వేల మంది చేనేత కార్మికులు గత మూడు దశాబ్దాలుగా రాష్ట్ర వస్త్రోత్పత్తి రంగానికి వెన్నెముకగా నిలుస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు, గురుకుల విద్యాసంస్థలు, ఇతర ప్రభుత్వ విద్యాసంస్థలకు అవసరమైన బెడ్‌షీట్లు, కార్పెట్లు, యూనిఫాంలు తదితర వస్త్ర ఉత్పత్తులను నిరంతరంగా సరఫరా చేస్తూ వేలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్నారు.

ఈ నేపథ్యంలో చేనేత కార్మికుల ఉపాధి, సంక్షేమం మరియు చేనేత రంగ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని, చేనేత ఉత్పత్తులను కేంద్రీకృత టెండర్ విధానం నుంచి మినహాయించాలని, వారి న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఎంకు మంత్రి కొండా సురేఖ వినతిపత్రం అందజేశారు. చేనేత ఉత్పత్తులను కేంద్రీకృత టెండర్ విధానం నుంచి మినహాయించడం ద్వారా వేలాది మంది చేనేత కార్మికుల ఉపాధిని పరిరక్షించవచ్చని మంత్రి సురేఖ సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.



## యోగా సెంటర్ నిర్మాణంపై.. ట్రస్ట్ బోర్డ్ కీలక నిర్ణయాలు

**వరంగల్, ఆయుధం:**

వరంగల్ నగరంలోని 'ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్ల ముఖ్య సమావేశం బుధవారం సాయంత్రం 6 గంటలకు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ట్రస్ట్ చైర్మన్, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ట్రస్ట్ బలోపేతానికి, సామాజిక సేవా కార్యక్రమాల విస్తరణకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాల వివరాలు క్రింది విధంగా ఉన్నాయి.

### పద్మశాలీ విద్యార్థులకు అడ్మిషన్ల ఆమోదం

ప్రస్తుత అకాడమిక్ విద్యా సంవత్సరంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన అర్హులైన విద్యార్థులకు ట్రస్ట్ ద్వారా అడ్మిషన్లు కల్పించాలని బోర్డు ఏకగ్రీవంగా నిర్ణయించింది. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ట్రస్ట్ అండగా ఉంటుందని ఈ సందర్భంగా చైర్మన్ వన్నాల శ్రీరాములు పునరుద్ఘాటించారు.

### నూతన యోగా సెంటర్ నిర్మాణం

ట్రస్ట్ భవనం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో అత్యాధునిక యోగా సెంటర్‌ను నిర్మించాలని బోర్డు తీర్మానించింది. ఈ నిర్మాణానికి కావలసిన ఆర్థిక వనరుల కోసం స్థానిక ప్రజాప్రతినిధులు, దాతల నుండి నిధులు సేకరించాలని, ఇందుకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలని నిర్ణయించారు.

### ఇతర సేవా కార్యక్రమాలపై చర్చ

చైర్మన్ అనుమతితో చేనేత కార్మికుల సంక్షేమం, ట్రస్ట్ భవిష్యత్తు ప్రణాళికలపై సభ్యులు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ట్రస్ట్ బోర్డు వర్కింగ్ ప్రెసిడెంట్, వరంగల్ జిల్లా ప్రజాపరిషత్ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, ట్రస్ట్ బోర్డ్ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది దాసరి ప్రేమ్ సాగర్, ట్రస్ట్ బోర్డు ఉపాధ్యక్షులు, పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు, వడ్నాల సదానందం, ట్రస్ట్ డైరెక్టర్లు, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, తెలంగాణ ఆన్ లైన్ మీడియా వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి వేముల సదానందం నేత, ప్రముఖ క్యాన్సర్ వైద్యులు మంచికట్ల జనార్దన్ పాల్గొన్నారు. ఈ సమావేశం విజయవంతం కావడానికి సహకరించిన మరియు విధిగా హాజరైన ట్రస్ట్ డైరెక్టర్లు, సలహాదారులు, కార్యవర్గ సభ్యులందరికీ ట్రస్ట్ డైరెక్టర్ కమ్ ఏవో వేముల సదానందం నేత ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సమాజ శ్రేయస్సు కోసం ట్రస్ట్ ఇలాగే నిరంతరం పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు.

## ప్లాస్టిక్ రహిత మార్కెట్లే లక్ష్యంగా.. ముందుకు సాగాలి


- కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి
- ప్రత్యామ్నాయ బ్యాగుల ప్రత్యేక స్టాల్‌ను ప్రారంభం

**హనుమకొండ, ఆయుధం:** పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్య రక్షణకు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, మార్కెట్లను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి అవసరమని జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి అన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో హన్మకొండ ఎక్సయిజ్ కాలనీ రైతు బజార్ లో ఏర్పాటు చేసిన జూట్, క్లాత్, బయోడిగ్రేడబుల్ బ్యాగుల ప్రత్యేక స్టాల్‌ను గురువారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు ప్రజల ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. అందువల్ల ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగులు, క్లాత్ బ్యాగులు, బయోడిగ్రేడబుల్ బ్యాగుల వినియోగాన్ని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని సూచించారు. మార్కెట్ ప్రాంతాల్లో వ్యాపారులు, వినియోగదారులు ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని పూర్తిగా మానుకుని పర్యావరణ హిత ఉత్పత్తులను వినియోగించాలని కోరారు. ఇకపై మార్కెట్లను దశలవారీగా ప్లాస్టిక్ రహిత మార్కెట్లుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక స్టాల్ ద్వారా ప్రజలకు అందుబాటు ధరల్లో ప్రత్యామ్నాయ బ్యాగులు లభిస్తాయని, వాటిని వినియోగించడంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, పొరుగువారిలో కూడా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ రాజారెడ్డి, ఆర్డీఓ వెంకటేష్, బల్దియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## సామూహిక ఉచిత వివాహాలు గొప్ప సేవ: సీపీ సన్‌ప్రీత్ సింగ్

**వరంగల్, ఆయుధం:** వెనుకబడిన తెగలకు చెందిన వారికి బంగారు పుస్తెలు, మట్టెలు అన్ని సమకూర్చి 18 జంటలకు పెళ్లిళ్లు చేయడము ఎంతో అభినందనీయమని వరంగల్ పోలీస్ కమీషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. గురువారం ఆయన సామూహిక వివాహాల పోస్టర్ ను ఆవిష్కరించి మాట్లాడుతూ.. ట్రస్ట్ చేస్తున్న సమాజ సేవ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ సందర్భంగా శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ మాట్లాడుతూ, జూన్ 24వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సామూహిక వివాహాలు ములుగు రోడ్ లో కల సప్తదాంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సామాజిక సేవా దృక్పథంతో శివానందమూర్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో 18 జంటలకు ఉచితంగా వివాహాలు జరిపించనున్నామని చెప్పారు. వివాహం చేసుకోవాలనుకుంటున్న అర్హత కలిగిన జంటలు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు 98484 23133 నంబర్‌ను సంప్రదించి తమ వివరాలను నమోదు చేసుకోవచ్చన్నారు. వివాహ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ట్రస్ట్ పర్యవేక్షణలో సమన్వయంతో నిర్వహించబడతాయని, వధూవరులు, వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. ఏసీపీ అంతయ్య, ట్రస్టీలు బండారు సాయినారాయణ, సదాశివుడు పాల్గొన్నారు.




## అటవీ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక వన సంరక్ష పురస్కారాలు

- ఫలించిన మంత్రి కొండా సురేఖ కృషి
- అటవీ సంరక్షణలో విశిష్ట సేవలకు నగదు ప్రోత్సాహకాలతో అవార్డులు
- అటవీ శాఖలో సేవాస్ఫూర్తి పెంపునకు కొత్త పురస్కారాల విధానం
- హర్షా తిరేకాలు వ్యక్తం చేసిన అటవీశాఖ సిబ్బంది
- సీఎం రేవంత్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపిన మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, ఆయుధం:** తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ సిబ్బంది అటవీ సంపద పరిరక్షణ, అటవీ భూముల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, అక్రమ కలప, వన్యప్రాణుల ఉత్పత్తుల రవాణా నియంత్రణ, అటవీ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో తమ ప్రాణాలకు తెగించి విశిష్ట సేవలు అందిస్తున్న అటవీ శాఖ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. గురువారం వన మహోత్సవం 2026 ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ సంపద సంరక్షణలో ప్రాణాలకు తెగించి పోట్లాడుతున్న అటవీ శాఖ సిబ్బందిని ప్రోత్సహిస్తూ " తెలంగాణ స్టేట్ వన సంరక్ష మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ రూల్స్-2026 (తెలంగాణ రాష్ట్ర వన (మిగతా 2లో..)



## మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలి

- హనుమకొండ అదనపు కలెక్టర్ ఎన్. రవి

**హనుమకొండ, ఆయుధం :** మొహర్రం పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను సిద్ధం చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ఎన్. రవి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మొహర్రం పండుగ ఏర్పాట్లు, నిర్వహణపై వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలతో సమన్వయ (మిగతా 2లో..)

### అటవీ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక

# వన సంరక్ష పురస్కారాలు

(మొదటి పేజీ తరువాయి..)
సంరక్షణ ప్రతిభా పురస్కార పతక నియమావళి )" ను ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది.

ఈ నూతన విధానం ద్వారా అటవీ శాఖ సిబ్బంది సేవలను అధికారికంగా గుర్తించి, వారి కృషికి తగిన గౌరవం కల్పించేందుకు నాలుగు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అమల్లోకి తెచ్చింది. తెలంగాణ వన సంరక్ష పతకము (రజత పతకం), తెలంగాణ ఉత్తమ వన సంరక్ష పతకం (వెండి పతకం), తెలంగాణ విశిష్ట వన సంరక్ష పతకం (బంగారు పతకః) తెలంగాణ ముఖ్యమంత్రి వన శౌర్య పతకం (ప్రత్యేక బంగారు పతకం) పేర్లతో నాలుగు పురస్కారాలను ప్రవేశపెట్టింది.

ఈ పురస్కారాల కింద పతకంతో పాటు నగదు బహుమతి, నెలవారీ ప్రోత్సాహక నగదు కూడా అందజేయనున్నారు. తెలంగాణ వన సంరక్ష పథకానికి రూ.10,000, ఉత్తమ వన సంరక్ష పథకానికి రూ.15,000, విశిష్ట వన సంరక్ష పథకానికి రూ.20,000, ముఖ్యమంత్రి వన శౌర్య పథకానికి రూ.25,000 నగదు బహుమతిని అవార్డు గ్రహీతలకు అందజేయనున్నారు. అదనంగా నెలవారీ నగదు ప్రోత్సాహకం కూడా ఇస్తారు.

అటవీ భూములను ఆక్రమణల నుంచి కాపాడడం, అటవీ నేరాల నియంత్రణ, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ అభివృద్ధి కార్యక్రమాల అమలు, నర్సరీల నిర్వహణ, అటవీ అగ్నిప్రమాదాల నివారణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(GIS), మేనేజ్ మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (MIS), పరిశోధన తదితర రంగాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఈ అవార్డులకు ఎంపిక చేయనున్నారు.

అటవీ శాఖలో సేవాస్ఫూర్తి, అంకితభావం, విధి పట్ల నిబద్ధతను మరింత పెంపొందించడంతో పాటు అటవీ సంపద రక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచే సిబ్బందిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి సురేఖ పేర్కొన్నారు. ఈ పురస్కారాలు అటవీ సంపద పరిరక్షణలో ఉద్యోగులు, సిబ్బంది ఉత్తమ సేవలు అందించేందుకు ప్రేరణనందిస్తాయని తెలిపారు. అటవీ సంపద పరిరక్షణలో తమ ప్రాణాలొడ్డి శ్రమిస్తున్న సిబ్బందిని ప్రోత్సహించే విధంగా వారికి అవార్డులు ప్రకటించాలన్న తన అభ్యర్థనకు త్వరలోనే కార్యరూపాన్నిచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి మంత్రి కొండా సురేఖ ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు, ఉద్యోగుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సురేఖ అన్నారు. ప్రతి సంవత్సరం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 న లేదా ప్రభుత్వం నిర్ణయించిన ఇతర ప్రత్యేక రోజుల్లో ఈ అవార్డుల కార్యక్రమం వుంటుందని మంత్రి కొండా సురేఖ సూత్రప్రాయంగా తెలిపారు.




## పవన్ పర్యటనకు సహకరించిన

# ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు

- జనసేన రాష్ట్ర నాయకులు గాదె పృథ్వీ

**హన్మకొండ, ఆయుధం:** హన్మకొండ హనుమాన్ నగర్ కు చెందిన నిరంజన్ జన్యుపరమైన వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమై తన అభిమాన హీరో, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ను చూడాలని కోరిన విషయం పార్టీ శ్రేణుల ద్వారా తెలుసుకున్న జనసేనాని వెంటనే స్పందించి తానే స్వయంగా వచ్చి బుధవారం నిరంజన్ ను పరామర్శించారు. నిరంజన్ కోరినట్లు కుటుంబ సభ్యులతో నలభై నిమిషాలు గడిపారు. వారికి ఉపాధి కల్పించి జీవనోపాధి కల్పించేందుకు ఆర్థిక సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నిరంజన్ ఆరోగ్యం బాగుండాలని వరంగల్ భద్రకాళి అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. పవన్ కళ్యాణ్ ను నిరంజన్ అడిగిన వెంటనే ఒక ట్యాబు, ఇష్టపడిన ఒక కుక్క పిల్ల స్థానిక జనసేన నాయకుల ద్వారా రెండు గంటల్లోనే అందించారు. అయితే ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు సహకరించిన తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగానికి వరంగల్ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాజేంద్ర ప్రసాద్, గడ్డం రాకేష్, ఆమంచ సునీల్, దినేష్, కొలిపాక వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


- తాజా మాజీ కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్
- ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ

**వరంగల్, ఆయుధం:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక గ్రూపులలో ఉన్న మహిళల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తోందని 37వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్ పేర్కొన్నారు. గురువారం డివిజన్లోని తూర్పుకోట పోచమ్మ దేవాలయం ప్రాంగణంలో ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర మహిళా అక్క చెల్లెలు అందరికీ ఇందిరా మహిళా శక్తి పేరుతో నాణ్యమైన చీరలను స్వయం సహాయక సంఘాలలో సభ్యులకు అందిస్తున్నారని తెలిపారు. స్వయం సహాయక గ్రూపులకు అనేక రాయితీలు అందిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలలో కూడా వీరిని భాగస్వామ్యం చేస్తూ పుట్టిర పరిశ్రమలు ఆర్టీసీ బస్సులో వరకు మహిళా సంఘాలకు చేయూతనిస్తూ మహిళలను కోటీశ్వరులు చేసే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, స్థానిక మంత్రి కొండ సురేఖ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా సీవో ప్రవీణ్, స్థానిక నాయకులు చందర్, అల్లం కేశవరాజు, ఏసిరెడ్డి రమేష్, మధు, శ్రీనివాస్, ప్రతాప్, యాకూబ్ పాషా, ఆర్పీలు కవిత, కల్పన, లతా రాజమణి, పర్వీన్, మహిళా సంఘాల గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

**పశువైద్యులు డా. కిరణ్ కు ఘన సన్మానం**

ఖిలా వరంగల్ మండలంలోని తూర్పుకోట పశువైద్యశాల లో ఐదు సంవత్సరాలు పనిచేసిన డాక్టర్ పున్నం కిరణ్ కుమార్ బదిలీ అయిన సందర్భంగా తాజా మాజీ కార్పొరేటర్, పిఎసిఎస్ డైరెక్టర్, రైతులు ఘనంగా వీడ్కోలు పలికారు. తాజా మాజీ కార్పొరేటర్ సువర్ణ సురేష్ శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి డాక్టర్ కిరణ్ కు సన్మానం చేశారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం బదిలీపై వచ్చిన డాక్టర్ రాజు ను కూడా శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏసీరెడ్డి రమేష్, కేశవరాజు, చందర్, ప్రతాప్, మాజీ డైరెక్టర్ బిల్ల హరేందర్, రైతులు ప్రసాద్, రాకేష్, భగత్, నరేష్, కొమురయ్య, సాంబయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మండల రాములు కు గంట రవికుమార్ నివాళి




**వరంగల్, ఆయుధం:** వరంగల్ రంగశాయిపేట వాస్తవ్యులు, అభ్యుదయ సేవ సమితి వ్యవస్థాపకులు మండల పరుశరాములు, కాకతీయ సేవా సమితి వ్యవస్థాపకులు మండల నరసింహ రాములు తండ్రి మండల రాములు (రామ్ రెడ్డి) ఇటీవల మృతిచెందగా.. విషయం తెలుసుకొని బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఈ రోజు రంగశాయిపేటలోని వారి నివాసానికి చేరుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి కపిల్ కుమార్, జిల్లా నాయకులు మదాసు రాజు, శ్రీరామోజు మోహనాచారి, కర్నె రవీందర్, షేర్ల అనిల్ కుమార్, దూడ పరమేశ్వర్, మండల మొగిలి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సవరణను పకడ్బందీగా నిర్వహించాలి

- ప్రతి ఓటరును ఖచ్చితంగా మ్యాపింగ్ చేయాలి
- హన్మకొండ కలెక్టర్, వరంగల్ తూర్పు ఈఆర్వో చాహత్ బాజ్‌పాయి
- ఎస్ఐఆర్ ప్రక్రియపై బూత్ స్థాయి అధికారులకు శిక్షణ



**హనుమకొండ, ఆయుధం:** ఓటరు జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రక్రియను పారదర్శకంగా, నిర్వహించి ప్రతి అర్హుడైన ఓటరును ఖచ్చితంగా మ్యాపింగ్ చేయాలని వరంగల్ తూర్పు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్వో), హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా గురువారం జీడబ్ల్యూఎంసీ కౌన్సిల్ హాల్‌లో వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని బూత్ లెవల్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 17 నుంచి 20వ తేదీ వరకు వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని సుమారు 230 పోలింగ్ కేంద్రాలకు చెందిన బీఎల్ఓలకు బ్యాచ్‌లవారిగా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించనున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతాయుతంగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి బీఎల్ఓ తన పరిధిలోని ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి, భారత ఎన్నికల కమిషన్ జారీ చేసిన డిక్లరేషన్ ఫారాలను ప్రతి ఓటరుకు అందజేయాలని తెలిపారు. ఫారాల స్వీకరణకు సంబంధించిన అంగీకార పత్రాన్ని (ఆక్నాలెడ్మెంట్) తప్పనిసరిగా పొందాలని, ఇంటింటి సర్వేలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పనిచేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఏ ఒక్క అర్హుడి ఓటు కూడా మిస్ కాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పులు, చిరునామా సవరణలు తదితర అంశాల్లో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ సందీప్ కుమార్, నాగరాజు లు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అనుసరించాల్సిన విధానాలు, ఫీల్డ్ స్థాయిలో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, డేటా నమోదు విధానం, ఫారాల నిర్వహణ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ద్వారా సమగ్ర అవగాహన కల్పించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రతి నమోదు ఖచ్చితంగా జరిగేలా బీఎల్‌ఓలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం విజయవంతం కావాలంటే క్షేత్రస్థాయిలో పనిచేసే ప్రతి బీఎల్ఓ నిబద్ధతతో విధులు నిర్వహించాలని, ప్రజలకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చే దిశగా పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో నాయబ్ తహశీల్దార్ సబ్హాన్ సంబంధిత ఎన్నికల అధికారులు, మాస్టర్ ట్రైనర్లు, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికల జాబితా ప్రత్యేక సవరణకు సన్నద్ధం కావాలి

- ఎస్.ఐ.ఆర్ నిర్వహణలో బి.ఎల్.ఓలు, బి.ఎల్.ఏల పాత్ర కీలకం
- శిక్షణ తరగతులను పకడ్బందీగా నిర్వహించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు, ఆయుధం:** ఎన్నికల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమానికి అధికారులు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని, ఎస్.ఐ.ఆర్ నిర్వహణలో బూత్ లెవల్ ఆఫీసర్లు, బూత్ లెవల్ ఏజెంట్ల పాత్ర కీలకంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు అన్నారు. గురువారం ఎస్.ఐ.ఆర్ నిర్వహణ, బి.ఎల్.ఓలు, బి.ఎల్.ఏల శిక్షణ తరగతుల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ములుగు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో చేపట్టనున్న ఎస్.ఐ.ఆర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు బూత్ లెవల్ ఆఫీసర్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైనదని, ప్రతి ఓటరుకు సరైన నమోదు, మార్పులు, సవరణలు ఖచ్చితంగా జరిగేలా అధికారులు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఓటరు జాబితాలో పొరపాట్లు లేకుండా, డూప్లికేట్ నమోదులను గుర్తించి, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించేలా బి.ఎల్.ఓలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 19వ తేదీ శుక్రవారం ములుగు, మల్లంపల్లి, వెంకటాపూర్ మండలాల వారికి ములుగు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో, గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల వారికి పి.ఎస్.ఆర్ గార్డెన్, గోవిందరావుపేటలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

20వ తేదీ శనివారం ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట మండలాల వారికి ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాల్‌లో, 22వ తేదీ సోమవారం కొత్తగూడ, గంగారం మండలాల వారికి కొత్తగూడ రైతు వేదికలో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు, పేరు, చిరునామా మార్పులు, డూప్లికేట్ నమోదుల గుర్తింపు, అభ్యంతరాల పరిశీలన, ఎన్నికల నిబంధనలు తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ వివరించారు.

మండలాల పరిధిలోని బి.ఎల్.ఓలు, బి.ఎల్.ఏలకు ముందస్తు సమాచారం అందించి, శిక్షణ తరగతులను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ములుగు నియోజకవర్గ పరిధిలోని 303 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ప్రతి కేంద్రానికి బి.ఎల్.ఓలు, సంబంధిత సూపర్వైజర్ల పేర్లు, సంప్రదింపు వివరాలను జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం, ఈ.ఆర్.ఓ కార్యాలయ నోటీస్ బోర్డుల ద్వారా, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వారీగా పోలింగ్ స్టేషన్ నంబర్, పేరు, సంబంధిత బి.ఎల్.ఓ పేరు, మొబైల్ నంబర్, బి.ఎల్.ఓ సూపర్వైజర్ పేరు, మొబైల్ నంబర్ వివరాలను ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంచాలన్నారు. ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలకు అవసరమైన సేవలు, మార్గదర్శకత్వం అందించడంలో బి.ఎల్.ఓలు కీలకంగా వ్యవహరించాలని, పారదర్శకత, ఖచ్చితత్వం, ప్రజల భాగస్వామ్యంతో ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి సిహెచ్ మహేందర్ జి,ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ కృష్ణవేణి, అన్ని మండలాల తహసీల్దార్లు సంబంధిత అధికారులు, ఎన్నికల సూపరిండెంట్ సలీం, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ నితీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

**వరంగల్, ఆయుధం:** ఎర్రబెల్లి ప్రదీప్ రావు జన్మదినాన్ని పురస్కరించుకొని, ఎర్రబెల్లి ప్రదీప్ రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. తిలక్ రోడ్‌లోని కెవిఎస్ ఫంక్షన్ హాల్‌లో ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్ రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి వినీత్ రావు మాట్లాడుతూ, ఎర్రబెల్లి ప్రదీప్ రావు జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం తమకు ఆనందంగా ఉందని తెలిపారు. సమాజంలో ఉన్న ప్రతి వర్గానికి ఉపయోగపడే విధంగా ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. శిబిరంలో నిపుణులైన వైద్యులు కంటి పరీక్షలు నిర్వహిస్తారని.. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్, కళ్లద్దాలు అందజేయబడతాయని తెలిపారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఈ శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకోవాలని, తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కందిమల్ల మహేష్, కోమాకుల నాగరాజు, మూసిపెట్ల నవీన్ గౌడ్, కోటా సతీష్, మామిడాల సురేష్, గడ్డం మహేష్, రాజేష్ తదితరులు పాల్గొని ఏర్పాట్లలో భాగస్వామ్యమయ్యారు.

# విద్యను వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ దోపిడీని అరికట్టాలి

**హనుమకొండ, ఆయుధం:** విద్యను వ్యాపారంగా మార్చిన కార్పొరేట్ సంస్థల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.సంతోష్ డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రభుత్వాన్ని వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. విద్య అనేది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, విద్యను సామాజిక బాధ్యతగా అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వాలు నేడు కార్పొరేట్ విద్యాసంస్థలకు అనుకూల విధానాలు అవలంబించడం వల్ల విద్య పూర్తిగా వ్యాపారంగా మారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు, భద్రతతో ముడిపడిన విద్యాసంస్థలు అన్ని ప్రభుత్వ నిబంధనలను పాటిస్తున్నాయా లేదా అనే అంశంపై ప్రభుత్వం, సంబంధిత శాఖలు సమగ్ర విచారణ నిర్వహించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇటీవల కాలంలో తమిళనాడులో విజయ్ ప్రభుత్వం ప్రైవేట్ కార్పొరేట్ ఫీజుల నియంత్రణ చట్టంపై పటిష్టమైన నిర్ణయం తీసుకొని అమలు చేస్తున్నారు, కానీ తెలంగాణ రాష్ట్రంలో అసలు ఎందుకు లేదని విమర్శించారు. ఇటీవల కాలంలో విద్యార్థుల సమస్యలపై ప్రశ్నించిన విద్యార్థి నాయకులపై అక్రమ కేసులు నమోదు చేయడం, ఉద్యమాలను అణచివేయాలని ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థి సంఘాలపై కేసులు పెట్టి ఉద్యమాలను ఆపలేరని, సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజుల పేరుతో తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శించారు. అడ్మిషన్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, ప్రత్యేక కార్యక్రమాల ఫీజులు, రవాణా ఛార్జీలు, హాస్టల్ ఫీజులు వంటి అనేక రూపాల్లో భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫార్ములు, షూస్, టైలు, బెల్టులు తదితర వస్తువులను నిర్దిష్ట దుకాణాల నుంచే కొనుగోలు చేయాలని ఒత్తిడి తీసుకువస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు, ఊట్కూరి ప్రణీత గౌడు, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీపతి వినయ్, యూనివర్సిటీ కార్యదర్శి బుజ్జి జ్యోతి, జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్, జిల్లా సమితి సభ్యులు కందగట్ల అజయ్, మహేష్ చరణ్ పాల్గొన్నారు.




## మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలి

(మొదటి పేజీ తరువాయి..)
సమావేశాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ నిర్వహించారు.

ఈ సందర్భంగా మొహర్రం పర్వదిన ఏర్పాట్లు, నిర్వహణపై అధికారులు, ముస్లిం మత పెద్దలతో సమీక్షించారు. జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ మొహర్రం సందర్భంగా ఊరేగింపు మార్గాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యం, ప్రత్యేక మరమ్మతులు, విద్యుత్ దీపాలు, నిరంతర విద్యుత్తు సరఫరా, వైద్య శిబిరాలు, అగ్నిమాపక భద్రత చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను చేయాలని మున్సిపల్, విద్యుత్, ఇతర సంబంధిత శాఖల అధికారులకు తెలియజేశారు. మతపెద్దలు సూచించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.

# మత్తు పదార్థాల నియంత్రణలో కంట్రోల్ టీం పనితీరు బేష్

- పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్, ఆయుధం:** పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి వినియోగం, రవాణా, సాగు, నిల్వ, సరఫరా, అక్రమ విక్రయాలను సమర్థవంతంగా అరికట్టడంతో పాటు యువతను మాదకద్రవ్యాలు, ఇతర చెడు వ్యసనాల బారిన పడకుండా రక్షించేందుకు డ్రగ్స్ కంట్రోల్ టీం పనితీరు అభినందనీయమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. 2024 జూలై 15న "డ్రగ్స్ కంట్రోల్ టీమ్" అనే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయగా.. ఈ బృందం నిరంతర నిఘా, సమాచార సేకరణ, ప్రత్యేక దాడుల ద్వారా గంజాయి సంబంధిత నేరాల్లో వ్యక్తులను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో లా అండ్ ఆర్డర్ పోలీసులకు సహకరిస్తోందన్నారు. మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, వాటికి సంబంధించిన చట్టపరమైన శిక్షలపై విద్యార్థులు, ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు.

గంజాయి సాగు, రవాణా, నిల్వ, సరఫరా లేదా అక్రమ విక్రయాలకు సంబంధించిన విశ్వసనీయ సమాచారాన్ని 8712685299, 8712584473 ఫోన్ నంబర్ల ద్వారా పోలీసులకు అందించి ప్రజలు సహకరించాలని వరంగల్ పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడుతూ, మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణమే డ్రగ్స్ కంట్రోల్ టీమ్ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు.

**డ్రగ్స్ కంట్రోల్ టీమ్ సాధించిన ఫలితాలు**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్ కంట్రోల్ టీమ్ 15072024 నుండి 16062026 వరకు గణనీయమైన ఫలితాలు సాధించిందని సీపీ తెలిపారు.

మొత్తం 192 కేసులు నమోదు కాగా.. 403 మందికి కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటి వరకు ఆయా కేసుల్లో 1,241.110 కిలోగ్రాములు గంజాయి, 7 గంజాయి మొక్కలు, ఓపియం 1.530 కిలోగ్రాములు, బ్రౌన్ షుగర్ 0.2 గ్రాములు, హాషీష్ ఆయిల్ 22.4 లీటర్లు, గంజాయి చాక్లెట్లు 251 స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ మొత్తం రూ. 8,57,90,978 ఉంటుందన్నారు. నిందితుల నుంచి రూ. 2,15,500/ నగదు, 601 మొబైల్ ఫోన్లు, 63 ద్విచక్ర వాహనాలు, 06 ఆటోలు, 08 కార్లు స్వాధీనం చేసుకున్నారు. కాగా, ధూమపాన వ్యసనానికి గురైన 435 మంది వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే వైద్యుల చెల్లుబాటు అయ్యే ప్రిస్క్రిప్షన్ లేకుండా నియంత్రిత మాత్రలను అక్రమంగా విక్రయిస్తున్న మెడికల్ షాపులపై ప్రత్యేక దాడులు నిర్వహించి, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, విద్యాసంస్థలు వంటి రద్దీ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నార్కోటిక్ డిటెక్షన్ డాగ్స్ సహాయంతో నిర్వహించబడగా, మాదకద్రవ్యాల నియంత్రణలో మరింత సమర్థవంతమైన ఫలితాలు సాధించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి.

పాఠశాలలు, కళాశాలలు, ప్రైవేట్ హాస్టళ్లలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు మరియు చట్టపరమైన పరిణామాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. .

**గంజాయి స్మోకర్ కేసులపై ప్రత్యేక అవకాశం**

ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. నెం.4 ప్రకారం, గతంలో గంజాయి వినియోగం సంబంధిత కేసులు నమోదైన వ్యక్తులు గుర్తింపు పొందిన డీఅడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందినట్లయితే, ఆ చికిత్సకు సంబంధించిన సర్టిఫికెట్‌ను సంబంధిత న్యాయస్థానంలోని మేజిస్ట్రేట్ కు సమర్పించవచ్చని సీపీ తెలిపారు.

మేజిస్ట్రేట్ ఆ సర్టిఫికెట్‌ను పరిశీలించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుని, అర్హులైన వ్యక్తులపై నమోదైన గంజాయి స్మోకర్ కేసులను కొట్టివేసే అవకాశం ఉంటుందన్నారు. గతంలో గంజాయి స్మోకర్ కేసులు నమోదైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, గుర్తింపు పొందిన డీఅడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందిన అనంతరం సంబంధిత సర్టిఫికెట్‌ను న్యాయస్థానానికి సమర్పించాలని సూచించారు. మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణంలో ప్రజల సహకారం ఎంతో అవసరం. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ముందుకు రావాలని వరంగల్ పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695